సాక్షి
యాదాద్రి భువనగిరి
శనివారం । 27 । మే । 2023



మత్స్యకారులు విలవిల
మండుటెండలకు నాగార్జునసాగర్ జలాశయ తీరంలోని మత్స్యకారులు విలవిల్లాడుతున్నారు.
- 10లో



గుంతల రోడ్లతో అవస్థలు
ఆలేరు మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు రాకపోకలకు వీల్లేకుండా ఉన్నాయి.
- 11లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
41°/29°
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గుట్ట మున్సిపల్ కమిషనర్‌గా బాలకృష్ణ

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా ఎస్.బాలకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఎస్.సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఅండ్‌డీఎంఏలో పోస్టింగ్ కోసం వేచి చూస్తున్న బాలకృష్ణను యాదగిరిగుట్ట కమిషనర్‌గా నియమించారు. కాగా ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రావణ్‌కుమార్‌రెడ్డి అనారోగ్యం కారణాలతో నెలరోజుల క్రితం సెలవుల్లో వెళ్లారు. అప్పటి నుంచి ఆలేరు మున్సిపల్ కమిషనర్ చక్రపాణి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. శ్రావణ్‌కుమార్ రెడ్డి శనివారం రిలీవ్ అయినట్లు తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో నూతన కమిషనర్ విధుల్లో చేరనున్నట్లు కార్యాలయ అధికారులు తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



ఎరువుల షాపులో రికార్డు పరిశీలిస్తున్న ఏడీఏ

రాజాపేట : నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ పద్మావతి హెచ్చరించారు. రాజాపేట మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఎరువులు, విత్తన నిల్వలకు సంబంధించిన రిజిస్టర్లు, బిల్ బుక్కులను పరిశీలించారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసిన వెంటనే రశీదు తీసుకోవాలని సూచించారు. అనంతరం రాజాపేట, రేణికుంటలో రైతులు సాగు చేసిన జీలుగా, వేసవి మినుము పంటలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వెళ్లి తూకాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బూర్గు భాగ్యమ్మ నర్సిరెడ్డి, ఏఓ మాధవి, ఏఈఓ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్ పరిధిని పూడ్చేందుకు యత్నం



ఊర చెరువులో పోసిన మట్టి కుప్పలు

చౌటుప్పల్ : మండల పరిధిలోని దేవలమ్మ నాగారం గ్రామంలోని ఊరచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని పూడ్చేందుకు సమీపంలోని ఓ పట్టాదారు యత్నించగా శుక్రవారం అధికారులు అడ్డుకున్నారు. చెరువు వెనుక భాగంలో ఓ పట్టాదారు రాళ్లు, మట్టిని కుప్పలుగా పోసి పూడ్చారు. స్థానికుల సమాచారం మేరకు నీటి పారుదల, రెవెన్యూ శాఖల అధికారులు చెరువును సందర్శించారు. సదరు ప్రాంతాన్ని ఎఫ్‌టీఎల్ పరిధిగా నిర్ధారించారు. మట్టిని తొలగించి చదును చేయాలని పట్టాదారుడికి ఆదేశించారు. ఈ విషయమై నీటిపారుదల శాఖా డీఈ రాజవర్ధన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

30న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

భువనగిరిటౌన్ : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 30వ తేదీన ఉదయం 10.30కి భువనగిరిలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జరగనుందని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు. ఎవ్వరికీ మినహాయింపు లేదన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనుల పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే

భువనగిరి : మున్సిపాలిటీ పరిధిలోని 34వ వార్డు పరిధిలో గల కిసాన్‌నగర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులను పనులను శుక్రవారం ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పరిశీలించారు. పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, వైస్ చైర్మన్ కిష్టయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ కమిటీ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వడ్డీ జమ కాలే..!

- అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ప్రొసీడింగ్స్, చెక్కులు అందజేత
- రెండున్నర నెలలుగా ఖాతాల్లో జమకాని నగదు
- స్వయం సహాయక సంఘాల ఎదురుచూపులు



మహిళా సంఘాలకు వడ్డీ చెల్లింపు ప్రొసీడింగ్ అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ (ఫైల్)

సాక్షి,యాదాద్రి : మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ సొమ్ము కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. మహిళా దినోత్సవం రోజు ప్రొసీడింగ్స్ అందజేసినా ఇప్పటికీ జమ చేయలేదు. జిల్లా వ్యాప్తంగా సుమారు 12వేల మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాలకు 2017 -18, 2018-2019 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి రూ.41.88 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. సంఘాలకు ప్రొసీడింగ్స్ అందజేసి రెండున్నర నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు అతీగతి లేదు.

అట్టహాసంగా ప్రొసీడింగ్‌ల పంపిణీ

అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు అట్టహాసంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళా సంఘాలకు వడ్డీ డబ్బులు మంజూరు చేసినట్లు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రకటించారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, కలెక్టర్, డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో మహిళా సంఘాల ప్రతినిధులను నియోజకవర్గ కేంద్రాలకు పిలిపించి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మహిళా సంఘాలు చెల్లించిన వడ్డీని తిరిగి వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు ప్రొసీడింగ్‌లతో పాటు చెక్‌లను అందజేశారు. కానీ, ఇప్పటి వరకు సంఘాల ఖాతాల్లో జమ కాలేదు.

రావాల్సిన వడ్డీ ఇలా..

జిల్లాలో సుమారు 12వేల స్వయం సహాయక మహిళా సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాలకు చెందిన 1.50లక్షల మంది సభ్యులు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని సకాలంలో వడ్డీతో సహా చెల్లిస్తున్నారు. వీరందరికీ ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం వడ్డీని రీయింబర్స్ చేస్తోంది. అయితే 2017-18 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 25.41 కోట్లు, 2018-19 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.16.47 కోట్లు విడుదల చేసింది. ఆయా సంఘాల వారీగా వారికి రావల్సిన మొత్తాన్ని లెక్కచేసి అకౌంట్లలో జమ చేస్తామని ప్రకటించడంతో మహిళా సంఘాల సభ్యులంతా ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వ వైఫల్యం



ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం మహిళా సంఘాలకు చెల్లించాల్సిన మిత్తి డబ్బులు వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలి. డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రొసీడింగ్స్ ఇచ్చి 3 నెలలు కావస్తున్నా ఇంత వరకు జమ చేయకపోవడం ప్రభుత్వం వైఫల్యం. 2023 మార్చి వరకు మొత్తం వడ్డీ డబ్బులు చెల్లించాలి. ఇందుకోసం కలెక్టర్ చొరవ చూపాలి.

–కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

మునుగోడులో మినహా..

మునుగోడు ఉప ఎన్నిక సమయంలో మునుగోడు నియోజకవర్గంలో మాత్రం మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ డబ్బులను వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. బడ్జెట్‌లో నిధులు కేటాయించినప్పకీ జిల్లాకు మాత్రం కేటాయింపులు జరగలేదని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని మిగతా నియోజకవర్గాల్లో ఎప్పుడు తమ డబ్బులు జమ అవుతాయోనని మహిళలు ఎదురుచూస్తున్నారు. అధికారులు సైతం చెప్పలేకపోతున్నారు. భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, నకిరేకల్‌ని యోజకవర్గాల్లోని సమభావన సంఘాల మహిళలు ఐదేళ్లుగా వడ్డీ కోసం ఎదురు చూస్తున్నారు.

12 స్థానాలు గెలుస్తాం



మిర్యాలగూడలోని ఎన్‌ఎస్పీ క్యాంప్ మైదానంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, వేదికపై మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు

- బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఉమ్మడి జిల్లా అభివృద్ధి
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- జిల్లా ప్రజలు చైతన్యవంతులు : మంత్రి జగదీశ్‌రెడ్డి

మిర్యాలగూడ : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మిర్యాలగూడ నియోజకవర్గంలో నిర్వహించిన ఆయా అభివృద్ధి పనులకు విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం మిర్యాలగూడలో ఎన్‌ఎస్పీ క్యాంపు మైదానంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా చరిత్రలో ఇప్పటివరకు ఏ పార్టీ కూడా 12 స్థానాలు గెలవలేదని.. తమ కంచుకోటగా చెప్పుకునే కాంగ్రెస్, టీడీపీ సైతం ఆరు స్థానాల కంటే ఎక్కువగా గెలవలేదన్నారు. ఇప్పుడు ఉమ్మడి నల్లగొండ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీకి కంచుకోటగా నిలిచిందన్నారు.

దేశానికే అన్నం పెట్టే స్థాయిలో తెలంగాణ

కాంగ్రెస్ నాయకులు తండ్రి, కొడుకులు.. భార్య, భర్త.. అన్నదమ్ములు తలా ఒక నియోజకవర్గంలో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు జిల్లా అభివృద్ధి కోసం ఏనాడూ పాటుపడలేదన్నారు. నాగార్జునసాగర్ పరిధిలోని రాజవరం మేజర్ కింద పొలాలు ఎండుతుంటే చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్న నాయకులను ప్రజలు గమనించారని తాము రాజవరం లోలెవల్ కెనాల్‌ను పూర్తి చేసి 80 వేల ఎకరాలకు సాగు నీరందించామని వివరించారు. గతంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి అయితే, ప్రస్తుతం కేసీఆర్ అందించిన సాగునీటితో 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తోందన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతుల నడ్డి విరిగిందని.. నేడు దేశానికి అన్నంపెట్టే స్థాయిలో తెలంగాణ రైతులు ఎదిగారని చెప్పారు.



మిర్యాలగూడలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

ప్రజలు భయపడరు : మంత్రి జగదీశ్‌రెడ్డి

మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుల్లో అహంకారంతో వ్యవహరిస్తున్నారని, జిల్లా ప్రజలు చైతన్యవంతులని, వారి గాండ్రింపులకు భయపడరని పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. రూ.40 వేల కోట్లతో నిర్మితమవుతున్న యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌తో మిర్యాలగూడ, దామరచర్ల ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు.

‘రీజినల్’ అలైన్‌మెంట్ మార్చాలి



భూ నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీఓ భూపాల్‌రెడ్డి

భువనగిరి : రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం రాయగిరి ట్రిబుల్ ఆర్ బాధితుల సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితుల సంఘం నాయకులు మాట్లాడుతూ.. రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని భువనగిరి మున్సిపల్ కౌన్సిల్‌లో చేసిన తీర్మానంపై ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి వివరణ ఇవ్వాలని భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయం లోపలికి వెళ్లి ఆర్డీఓ భూపాల్‌రెడ్డితో మాట్లాడారు. అలైన్‌మెంట్ మార్చాల్సిందేనని, తమకు న్యాయం జరగకపోతే ఈ నెల 29న కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజనల్ రింగ్ రోడ్డు బాధితుల సంఘం నాయకులు తంగళ్లపల్లి రవికుమార్, పాండు, నాయకులు రైతులు పాల్గొన్నారు.

వెల్వర్తి సర్పంచ్ సస్పెన్షన్

వలిగొండ : మండలంలోని వెల్వర్తి గ్రామ పంచాయతీ సర్పంచ్ పసల అన్నామేరీని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీ నిధులను సర్పంచ్ దుర్వినియోగం చేశాడన్న అభియోగంపై సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ గీతారెడ్డి తెలిపారు. సర్పంచ్‌ను సస్పెండ్ చేసిన నేపథ్యంలో వార్డు సభ్యులు సమావేశం అయ్యారు. జాయింట్ చెక్ పవర్ కోసం కడవేరు సరోజను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి వీసం నరేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అవినీతికి తావులేకుండా పని చేస్తానన్నారు.

పార్టీని మరింత బలోపేతం చేయండి

- గొంగిడి దంపతులకు సీఎం సూచన



ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ దంపతులతో ప్రభుత్వ విప్ సునీత, డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట : నా ఆశీస్సులు మీకు ఎల్లవేళలా ఉంటాయి.. పార్టీని మరింత బలోపేతం చేయండి.. ప్రభుత్వ పథకాలు ఇంటింటికి చేరేలా కృషి చేయాలని సీఎం కేసీఆర్.. ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డికి సూచించారు. శుక్రవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి దంపతులు కలిశారు. యాదాద్రీశుడి లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం విప్ సునీత ఆలేరు నియోజకవర్గ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. యాదాద్రి ఆలయానికి అనుబంధంగా ఉన్న పాత గుట్ట దేవస్థానం వరకు డబుల్‌రోడ్డు నిర్మాణానికి, ఆలేరు నియోజకవర్గంలోని బీటీ రోడ్లకు, ఖబరస్తాన్‌లు, పీర్ల కొట్టాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించినట్లు విప్ సునీత తెలిపారు. అంతేకాకుండా ఆలేరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తాము చేస్తున్న కృషిని సీఎం ప్రశంసించడమే కాకుండా మహేందర్‌రెడ్డిని గుడ్ జాబ్ అంటూ అభినందించారని సునీత వెల్లడించారు. నష్టాల్లో ఉన్న నల్లగొండ డీసీసీబీని అనతి కాలంలోనే లాభాల బాటలోకి తీసుకొచ్చావ్ అంటూ మహేందర్‌రెడ్డిని ప్రశంసించారని చెప్పారు. రైతులకు సేవ చేసే భాగ్యం కలగడం గొప్ప అదృష్టంగా భావించాలని సూచించినట్లు ఆమె పేర్కొన్నారు.ఇదే విధంగా సమన్వయంతో ముందు కెళ్లాలని తన ఆశీస్సులు ఉంటాయన్నారు.

ఇక్కడి రైతుల బాధలు పట్టవా?

- గూడూరు నారాయణరెడ్డి



విలేకర్లతో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు గూడూరు నారాయణరెడ్డి

సాక్షి, యాదాద్రి : రంగారెడ్డి జిల్లాలో రైతులు కోరితే 111 జీఓ రద్దు చేశారని, భువనగిరి నియోజకవర్గ పరిధిలో రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను కూడా మార్చాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం భువనగిరిలోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలోఆయన మాట్లాడారు. భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి రీజినల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులను పట్టించుకోవడం లేదన్నారు. అలైన్‌మెంట్ మార్పుకోసం భువనగిరి మున్సిపాలిటీలో కౌన్సిల్ తీర్మానం చేసినట్టుగానే కలెక్టర్, ముఖ్యమంత్రితో చర్చించాలన్నారు. రంగారెడ్డి జిల్లాలో లక్ష 32 వేల ఎకరాలకు సంబంధించి 111జీఓను ఎందుకు రద్దు చేశారన్నారు. రైతులు గ్రామ పంచాయతీల్లో తీర్మానం చేసినందుకు గాను ఆ జీఓను రద్దు చేశారని పేర్కొన్నారు. మరి ఇక్కడ కూడా 11 గ్రామాల రైతులు తమకు జీవనాధారమైన భూములు కోల్పోతున్నారని, అయినా రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పు గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. భువనగిరి మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ చేసిన తీర్మానం కాపీని ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించాలని డిమాండ్ చేశారు. సీఎం కార్యాలయం నుంచి ప్రధానమంత్రి కార్యాలయానికి లేఖ వెళ్తే తాను స్వయంగా మోదీని కలిసి రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రత్నాపురం శ్రీశైలం, ఓబీసీ భువనగిరి పట్టణ అధ్యక్షుడు తుమ్మల నగేష్, పట్టణ అధికార ప్రతినిధి కాముని వీరన్న, బీజేపీ, బీజేవైఎం నాయకులు రామ్, ఎదుగని సంతోష్ , రైతులు అవిషెట్టి పాండు, మల్లేష్, వైకుంఠం, కుమార్, వీరయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

పేరుకే మోడల్ రైతు బజార్!

- ఎస్టేట్ అధికారి, సూపర్‌వైజర్ లేకుండానే నిర్వహణ
- వాచ్‌మన్లూ లేరు
- కొరవడిన పర్యవేక్షణ
- అధిక ధరలకు కూరగాయల విక్రయం



భువనగిరిలోని రైతు బజార్

భువనగిరి : అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకున్న భువనగిరి రైతు బజార్ నిర్వహణ గాడి తప్పింది. కోట్లాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ రైతు బజారులో అధికారులను నియమించడంలో ఉన్నతస్థాయి యంత్రాంగం చోద్యం చూస్తోంది. వెరసి పర్యవేక్షణ లేక వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నిర్ణీత ధర కంటే ఎక్కువకు విక్రయిస్తున్నట్లు వినియోగదారులు వాపోతున్నారు.

రూ.1.56 కోట్లతో ఆధునీకరణ

భువనగిరిలోని నీటిపారుదల శాఖ స్థలంలో 2001లో 52 స్టాళ్లతో రైతుబజార్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత 2017లో రూ.81 లక్షలతో అభివృద్ధి చేసి 74 స్టాళ్లకు పెంచారు. మోడల్ రైతుబజార్‌గా మార్చేందుకు రూ.1.56 కోట్ల అంచనాతో 2022 మార్చిలో 74 ఉన్న స్టాళ్లను 126కు పెంచారు. అధునాతన రీతిలో వీటి నిర్మాణం చేపట్టారు.

జిల్లాలో ఏకైక రైతుబజార్

జిల్లాలోనే ఏకైక రైతు బజార్‌లో భువనగిరిలో ఉంది. ఇక్కడికి భువనగిరితో పాటు పరిసర గ్రామాల నుంచి వినియోగదారులు వస్తుంటారు. రైతు బజార్ నిర్వహణ, పర్యవేక్షణకు ఎస్టేట్ అధికారి, సూపర్‌వైజర్ తప్పనిసరిగా ఉండాలి. ఇంత పెద్ద రైతుబజార్‌కు అధికారులు లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడింది. దీంతో వ్యాపారులు అధిక ధరలకు కూరగాయలను విక్రయిస్తున్నారు. కూరగాయల విక్రయదారులు ఒక్కొక్కరు నెలకు రూ.5వేల చొప్పున వేసుకొని వాచ్‌మన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. మార్కెట్ కమిటీ సిబ్బంది రైతుబజార్ ఆలనాపాలన చూస్తున్నారు. ఇతడే స్టాళ్ల నుంచి నెలనెలా అద్దె వసూలు చేస్తుంటాడు. ఈ నెల 17న రైతు బజార్‌ను ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వినియోగదారులు వివిధ సమస్యలతో పాటు అధికారులు లేరన్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

ప్రతిపాదనలు పంపాం

రైతు బజార్‌లో ఎస్టేట్ అధికారి, సూపర్‌వైజర్, ఇద్దరు వాచ్‌మన్లు ఏర్పాటు చేయడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. వారి నుంచి ఆదేశాలు వస్తే వెంటనే నియమిస్తాం. నిర్ణీత రేట్ల కంటే ఎక్కువ ధరకు కూరగాయలు విక్రయిస్తే వినియోగదారులకు తమకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని. ప్రస్తుతం మైకు ద్వారా ఈ విషయాన్ని తెలియజేస్తున్నాం.

– సబిత, జిల్లా మార్కెటింగ్ అధికారి

పాలీసెట్‌లో బాలికలదే పైచేయి

సాక్షి, యాదాద్రి : పాలీసెట్ ఫలితాల్లో బాలికలు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. మే 17న నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 1,545 మంది హాజరయ్యారు. మూడేళ్ల సాంకేతిక డిప్లమా కోర్సులో చేరడానికి రాష్ట్ర సాంకేతిక విద్య మరియు శిక్షణ మండలి ఈ పరీక్షలు నిర్వహించింది. మొత్తం 1,545 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా బాలురు 864, బాలికలు 681 మంది ఉత్తీర్ణులయ్యారు. పలువురు విద్యార్థులు ఎంపీసీ, ఎంబైపీసీ కోర్సుల్లో రెండు పరీక్షలు రాశారు. కాగా ఎంపీసీ విభాగంలో బాలురు 651(75.35శాతం), బాలికలు 589 (86.49శాతం) మంది పాసయ్యారు. బాలబాలికలు కలిపి 1240 మంది (80.26శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఇక ఎంబైపీసీలో 1,266 మంది బాలబాలికలు (81.94) ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 665 మంది (76.97శాతం), బాలికలు 601 మంది (88.25శాతం) ఉత్తీర్ణులయ్యారు.

జిల్లా టాపర్లు

ఎంపీసీ విభాగంలో చిక్క అక్షర (113) జిల్లా స్థాయిలో ప్రథమ, గొరెంకల అక్షర (109) ద్వితీయ, మహ్మద్ జెబా(106) తృతీయ స్థానంలో నిలిచారు. ఎంబైపీలో చిక్క అక్షర (113) ప్రథమ, మహ్మద్ జెబా(105) ద్వితీయ, ఎండీ అబ్దుల్ జీషాన్ (103) తృతీయ స్థానం సాధించారు.

రామన్నపేట ఆస్పత్రి అప్‌గ్రేడ్‌కు హామీ

- ఆస్పత్రి ప్రాధాన్యతను మంత్రికి వివరించిన ఎమ్మెల్యే చిరుమర్తి



ఆస్పత్రి సమస్యలను మంత్రి హరీశ్‌రావుకు వివరిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట : రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి స్థాయిని వంద పడకలకు పెంచడానికి వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్‌రావ్ హామీ ఇచ్చారని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తెలిపారు. శుక్రవారం మిర్యాలగూడలో జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన మంత్రి హరీష్‌రావ్‌ను ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కలిసి ఆస్పత్రి సమస్యలను వివరించారు. నల్లగొండ, యాదాద్రి జిల్లాల పరిధిలోని సుమారు వంద గ్రామాల ప్రజలకు రామన్నపేట ఆస్పత్రి ద్వారా వైద్యసేవలు అందుతున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్ర ఆస్పత్రికి దీటుగా కాన్పులు జరుగుతుంటాయని, ఆస్పత్రి స్థాయిని పెంచితే ఇంకా మెరుగైన సేవలు అందుతాయని వివరించారు. ఆస్పత్రి భవనాలు శిథిలదశకు చేరాయని, పైకప్పు పెచ్చులూడి పడుతున్నాయన్నారు.వానాకాలంలో గోడలు, స్లాబ్ గుండా నీరు కారుతుందని వివరించారు. నూతన భవనాల నిర్మాణానికి రూ.25కోట్లు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఆస్పత్రి స్థాయిని పెంచడంతోపాటు, భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించుటకు మంత్రి అంగీకరించారని ఎమ్మెల్యే విలేకరులకు తెలిపారు.

విద్య, పోషకాహార లోపంపై సర్వే

చౌటుప్పల్ : విద్య, ఆహారం, పోషకాహార లోపం అంశాలపై జిల్లా వ్యాప్త కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చౌటుప్పల్ పట్టణంలో గ్రౌండ్ లెవల్ సర్వే చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం, ఇండీసెట్ సంస్థ సంయుక్తంగా పోలింగ్ స్టేషన్ల వారీగా ఈ సర్వే నిర్వహిస్తున్నారు. విద్యానగర్‌కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులతో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న పోషకాహారం, పోషకాహార లోపం కలిగిన వ్యక్తుల గుర్తింపు, చిన్నారులకు అందుతున్న విద్య, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వ్యక్తులు, వారికి లబ్ధి చేకూరుతున్న సంక్షేమ పథకాల వివరాలపై ఆరా తీశారు. వారు చెప్పిన వివరాలను సర్వే బృందం రికార్డుల్లో నమోదు చేసుకుంది. ప్రతి పోలింగ్ కేంద్రం నుంచి 5 శాంపిల్స్ సేకరిస్తున్నట్లు సర్వే బృందం సభ్యుడు వలబోజు రామకృష్ణ, బూడిద శివ తెలిపారు.

క్లుప్తంగా

యాదాద్రి ఘాట్‌రోడ్డుపై నాగుపాము ప్రత్యక్షం



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయానికి వెళ్లే దారిలోని మొదటి ఘాట్ రోడ్డుపై నాగుపాము ప్రత్యక్షమైంది. స్థానిక భక్తులు, ఎస్‌పీఎఫ్, హోంగార్డు సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. శుక్రవారం ఉదయం 11గంటల సమయంలో మొదటి ఘాట్‌రోడ్డు నుంచి కొండపైకి వెళ్లే మార్గంలో ఉన్న జీయర్ కుటీర్ సమీపంలోని ప్రధాన రహదారిపైకి నాగుపాము వచ్చింది. గమనించిన భక్తులు, పోలీస్ సిబ్బంది భయాందోళన చెందారు. ఆ సమయంలోనే ఓ వాహనం అటువైపు వెళ్తుంటే పాము ఒక్కసారిగా పడగ విప్పి కూర్చుంది. సుమారు 30నిమిషాల పాటు అలాగే ఉంది. సుమారు అర్ధగంట తర్వాత నాగుపాము పక్కనే ఉన్న చెట్ల పొదల్లోకి వెళ్లింది.

అనుమతులు లేకుండా నిర్మించిన గోడ కూల్చివేత

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట మున్సిపాలిటీ కార్యాలయంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన గోడను చైర్‌పర్సన్ సుధా, కౌన్సిలర్లు, అధికారుల సమక్షంలో సిబ్బంది శుక్రవారం తొలగించారు. పాత మున్సిపల్ కార్యాలయం శిథిలావస్థలో ఉందని, మున్సిపల్ ఆధీనంలో ఉన్న ఫంక్షన్ హాల్ అండ్ లాడ్జీలోకి కార్యాలయాన్ని నాలుగు రోజుల క్రితం తరలించారు. ఈ క్రమంలో లాడ్జీని లీజుకు తీసుకొని నడిపిస్తున్న నిర్వాహకుడు తాత్కాలిక మున్సిపల్ కార్యాలయం నుంచి ఫంక్షన్‌హాల్‌లోకి వెళ్లే దారిలో ఎలాంటి అనుమతులు లేకుండా గురువారం అర్ధరాత్రి గోడను నిర్మించారు. శుక్రవారం ఉదయం అధికారులు, సిబ్బంది వచ్చే సరికి గోడ ఉండటంతో వెంటనే చైర్‌పర్సన్‌కు, కమిషనర్‌కు సమాచారమిచ్చారు. వారు అక్కడకు చేరుకుని గోడను తొలగింపజేశారు. ఈ విషయంపై లాడ్జీ యజమానిని పిలిపించి అడిగితే మున్సిపల్ కార్యాలయానికి, లాడ్జీకి ఇబ్బంది లేకుండా గోడ నిర్మించినట్లు తెలిపారు. లీజు సమయం ముగిసినా లాడ్జీని నడిపిస్తున్నారని, వెంటనే ఖాళీ చేయాలని నిర్వాహకుడికి సూచించారు.

ఎండలకు మత్స్యకారులు విలవిల

- వలకు చేపలు చిక్కక ఉపాధి భారం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

నాగార్జునసాగర్: మండుటెండలకు నాగార్జునసాగర్ జలాశయ తీరంలోని మత్స్యకారులు విలవిల్లాడుతున్నారు. వలకు చేపలు చిక్కక పస్తులుండే పరిస్థితి దాపురించిందని వాపోతున్నారు. భానుడి ప్రతాపానికి జలాశయంలోని నీరు విపరీతంగా వేడెక్కుతుండడంతో చేపలు నీటి పైకి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మర పడవలలో పుట్టీలను వేసుకొని జలాశయం లోపలికి వెళ్లి చేపలు పట్టే పరిస్థితి నెలకొందని మత్స్యకారులు అంటున్నారు. గతంలో పుట్టీల్లోనే జలాశయంలోకి వెళ్లేవారమని నేడు ఆ పరిస్థితి లేదని పేర్కొంటున్నారు. జలాశయం తీరం వెంట సుమారు 10వేల మత్స్యకారుల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీరిలో డ్యాం నిర్మాణ సమయంలో ఇక్కడికి వచ్చి స్థిరపడిన కుటుంబాలే ఎక్కువ. వీరితో పాటు జలాశయ తీరం వెంట స్థానికంగా ఉన్న గ్రామాలు, తండాలవాసులు బతుకుదెరువు కోసం మత్స్యకారులుగా మారారు. ఈ వేసవిలో ఎండలు అధికంగా ఉండటంతో చేపలు నీళ్ల లోపలే ఉంటున్నాయని పైకి రాకపోవడంతో వలకు చిక్కడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. ఉదయం 10గంటల నుంచే ఎండ వేడిమి పెరుగుతుండటంతో తీరం వెంట పుట్టీల కిందనే ఉంటున్నామని తెలిపారు. చేపలు పట్టి అమ్ముకునే తమకు విక్రయించడానికి చేపలు లేక పస్తులుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండలు తగ్గితే తప్ప జలాశయంలోకి వెళ్లలేమని, వడగాల్పులకు పుట్టీల కింద కూడా ఉండలేకపోతున్నామని మత్స్యకారులు అంటున్నారు. మత్స్యకారులను ప్రభుత్వమే ఆదుకోవాలని మత్స్యకార సంఘాలు కోరుతున్నాయి.



నది తీరాన ఉన్న పడవలు

బియ్యం, నగదు అందజేయాలి



మత్స్యకారుల కుటుంబాలకు వేసవిలో చేపలు దొరకడం కష్టంగా మారింది. వేసవిలో పొట్టపోసుకోవడానికి ప్రభుత్వం అదనపు బియ్యం ఇవ్వాలి. రోజువారి నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ.3వేలు ఇవ్వాలి.

– కోదండం, మత్స్యకార సంఘం మాజీ అధ్యక్షుడు



సాగర్ జలాశయం తీరంలో పుట్టీల కింద ఉన్న మత్స్యకారులు



చేపలు పట్టేందుకు పుట్టీపై నదిలోకి వెళ్తున్న మత్స్యకారులు



చేపలు పట్టేందుకు వల విసురుతున్న మత్స్యకారులు

కడుపునొప్పి భరించలేక..

- వేర్వేరు చోట్ల ఇద్దరి బలవన్మరణం

రాజాపేట : కడుపునొప్పి భరించలేక వేర్వేరు చోట్ల ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. కోదాడ, రాజాపేట మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. రాజాపేట మండలంలోని సోమారం గ్రామానికి చెందిన తమ్మడి శ్రీనివాసులు, పద్మల పెద్దకుమారుడు సిద్దులు (26) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం కూడా సిద్దులుకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో తట్టుకోలేక గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. అనంతరం విషయాన్ని తమ్ముడికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని అతడిని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడినుంచి భువనగిరి ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

చెట్టుకు ఉరేసుకుని..

కోదాడరూరల్ : అనంతగిరి మండలం బొజ్జగూడెం గ్రామానికి చెందిన భుక్య బంద్యా(70) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. దీనికి తోడు అతని భార్య ఆరోగ్యం కూడా బాగోలేదు. కుటుంబ సమస్యలు అధికం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి అతను పనిచేస్తున్న కోదాడ పట్టణంలోని పాత ఇనుప సామగ్రి కొనుగోలు చేసే దుకాణంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. శుక్రవారం ఉదయం పక్కన పండ్ల వ్యాపారం చేసే వ్యక్తి గమనించి షాపు యజమానికి సమాచారం ఇచ్చాడు. అతను సంఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు అక్కడకు చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

హరీశ్‌రావుకు ఆరోగ్యశ్రీ ఉద్యోగుల వినతి



హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఆరోగ్య మిత్రలు

మిర్యాలగూడ అర్బన్: పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శుక్రవారం మిర్యాలగూడకు వచ్చిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు ఆరోగ్యశ్రీ సిబ్బంది (ఆరోగ్యమిత్ర)లు వినతిపత్రం అందచేశారు. కనీస వేతనం రూ. 28 వేలు ఇవ్వడంతో పాటు టీఏ, డీఏ కల్పించాలని, ఆరుగంటల పనిదినాన్ని అమలు చేసి, ఆస్పత్రులకు వచ్చే డబ్బులలో ఆరోగ్యమిత్రలకు ప్రోత్సాహక పర్సంటేజీలు ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ప్రభుత్వం నుంచి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఉద్యోగులందరికీ హెల్త్‌కార్డుల సౌకర్యం కల్పించాలని వినతి పత్రంలో కోరారు.

హత్య కేసులో ముగ్గురిపై కేసు

గుర్రంపోడు : మండంలోని కొప్పోలులో గురువారం జరిగిన యువకుడు బొడ్డు సంతోష్ హత్య కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. దాడికి పాల్పడిన బాలిక తండ్రి ఆవుల మల్లయ్య, నాయినమ్మ రాములమ్మ, బంధువు ఆవుల నగేష్‌లపై మృతుడి బాబాయి వనం నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కాగా, కట్టంగూర్ మండలం దుగినెల్లి గ్రామానికి చెందిన సంతోష్ తల్లిదండ్రులు సైదులు రేణుకలు శుక్రవారం ఉదయం సూరత్ నుంచి నల్లగొండ ఆస్పత్రికి చేరుకున్నారు. విగతజీవిగా మారిన కుమారుడిని చూసి కన్నీరుమున్నీరయ్యారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నారు.

గాయపడిన యువకుడు మృతి

భువనగిరి : రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 24న ఆలేరు వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనం మండల పరిధిలోని రాయగిరి సమీపంలో రెండు ద్విచక్రవాహనాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌లపై ప్రయాణిస్తున్న జావిద్, యాసిన్, కేతన్, గణేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కేతన్ (21)శుక్రవారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

పెద్దవూర : బాలికపై ఓ బాలుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పెద్దవూర మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని ఓ తండాకు చెందిన బాలికను అదే మండలం మరో తండాకు చెందిన బాలునికి కొంత కాలం క్రితం పరిచయం ఏర్పడింది. ఈ పరిచయాన్ని ఆసరాగా తీసుకుని సదరు బాలుడు మాయమాటలతో బాలికను శారీరకంగా లొంగదీసుకున్నాడు. ఇదే క్రమంలో గురువారం రాత్రి సదరు బాలిక ఇంటికి రావడంతో ఆ బాలిక గట్టిగా కేకలు వేసింది. కుటుంబ సభ్యులు మేల్కొనడంతో బాలుడు పరారుకాగా ఈ విషయ వెలుగులోకి వచ్చింది. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పరమేష్ తెలిపారు.

చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

సంస్థాన్ నారాయణపురం : తాటి చెట్టు పైనుంచి కిందపడి ఓ గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం సంస్థాన్‌నారాయణపురంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన గౌడ సంఘం గౌరవ అధ్యక్షుడు నీళ్ల నర్సింహ(70) రోజు మాదిరిగానే కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కాడు. కల్లు తీసే ప్రయత్నంలో ప్రమాదశాత్తు జారి కిందపడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రి అయినా నర్సింహ ఇంటికి రాకపోవడంతో తాటివనాల్లో వెతకగా అప్పటికే మృతిచెందాడు.

రెస్టారెంట్‌లో కుళ్లిపోయిన చికెన్ పట్టివేత

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని హోం డ్లామ్‌మార్కెట్‌లోని గ్రీన్‌బకెట్ రెస్టారెంట్‌లో శుక్రవారం మున్సిపల్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వినియోగానికి వంటిగదిలో ఉంచిన కుళ్లిపోయిన చికెన్‌ను పట్టుకున్నారు. అదే విధంగా పాడైపోయిన చికెన్‌ను పక్కనే ఉన్న డ్రెయినేజీలో సైతం కలుపుతున్నట్లుగా గుర్తించారు. వీటితోపాటు రెస్టారెంట్ పరిసరాల్లో అపరిశుభ్రంగా ఉండడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెస్టారెంట్ యజమానికి రూ.5వేల జరిమానా విధించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే రెస్టారెంట్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

కలెక్టర్.. రాక్ క్లైంబింగ్



యాదాద్రి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి భువనగిరి ఖిలాపై రాక్ క్లైంబింగ్ చేశారు. ఇటీవల తన కుమారుడుతో కలిసి ఖిలా వద్దకు వెళ్లారు. కుమారుడు జిప్‌లైన్ చేయగా కలెక్టర్ రాక్ క్లైంబింగ్ చేశారు. ఆ ఫొటోలు కలెక్టర్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టుచేశారు. అవి శుక్రవారం బయటకు వచ్చి వాట్సప్‌లలో చక్కర్లు కొట్టాయి. – భువనగిరి

మంత్రుల పర్యటనలో కార్యకర్తకు గాయాలు

- బీఆర్‌ఎస్ కార్యకర్త కాలుపైకి ఎక్కిన దేవరకొండ ఎమ్మెల్యే కారు

మిర్యాలగూడ అర్బన్ : మంత్రుల పర్యటనలో అపశ్రుతి చోటుచేసుకుంది. శుక్రవారం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో మంత్రులు నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం తిరిగి వెళ్తున్న క్రమంలో కాన్వయ్‌లోని దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రనాయక్ కారు మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త చిట్యాల సైదయ్య కాలుపైకి ఎక్కింది. వెంటనే గట్టిగా అరవడంతో కారును ఆపిన డ్రైవర్ వెనకకు తీశాడు. కాలికి గాయం కావడంతో తోటి కార్యకర్తలు వెంటనే ఆస్పత్రిలోకి తీసుకెళ్లారు. ప్రమాదం జరిగినా ఎమ్మెల్యే కారు దిగకుండా వెళ్లిపోవడంపై అక్కడున్న కార్యకర్తలు అసహనం వ్యక్తం చేశారు.



గాయపడిన కార్యకర్తను ఆస్పత్రికి తీసుకెళ్తున్న తోటి కార్యకర్తలు

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

చివ్వెంల (సూర్యాపేట) : భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవితఖైదుతో పాటు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడ మండలం హట్యాతండాకు చెందిన సరోజకు పెన్‌పహాడ్ మండలం జల్మాల్‌కుంట తండాకు చెందిన నునావత్ స్వామితో 18 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 2020 సంవత్సరంలో ఏప్రిల్ నెలలో స్వామి తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని అనుమానిస్తూ తండ్రి నునావత్ బీక్యాను హత్య చేశాడు. అనంతరం మూడు నెలల తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చి అదే సంవత్సరం ఆగస్టు నెలలో రాత్రి 11.30 గంటల సమయంలో నిద్రిస్తున్న భార్యపై గొడ్డలితో దాడి చేసి కడతేర్చాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు మృతురాలి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐ రంజిత్ రెడ్డి కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ చేశారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి అడిషినల్ పీపీ కాకి రాంరెడ్డి వాదనలతో ఏకీభవిస్తూ నిందితుడికి జీవితఖైదుతో పాటు, రూ.వెయ్యి జరిమానా విధించారు. పీపీకి లైజన్ ఆఫీసర్ సురేంద్రబాబు, కోర్టు కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు సహకరించారు.

అంబోజు అనిల్‌కు మంత్రి సబితారెడ్డి అభినందనలు

యాదగిరిగుట్ట: సౌత్ కొరియాలో ఈనెల 12 నుంచి 20 వరకు జరిగిన ఏషియన్ పసిఫిక్ మాస్టర్ గేమ్స్ 2023 పోటీల్లో యాదాద్రి దేవస్థానంలో బాంబ్ స్క్వాడ్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న అంబోజు అనిల్‌కుమార్ అథ్లెటిక్స్ విభాగంలో బంగారు పతకం సాధించారు. ఈమేరకు ఆయనను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అభినందించారు. తెలంగాణ మాస్టర్ గేమ్స్ అసోసియేషన్ చైర్మన్ జగజీవన్ రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షులు సంగీతతో కలిసి అనిల్‌కుమార్ మంత్రి సబితాఇంద్రారెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. మంత్రిని కలిసిన వారిలో సెక్రటరీ డాక్టర్ సంతోష్ కుమార్, వేణుమాధవ్ తదితరులున్నారు.



అనిల్‌కుమార్‌ను అభినందిస్తున్న మంత్రి సబితాఇంద్రారెడ్డి

మూగజీవి యాతన

- గుర్తుతెలియని వాహనం ఢీకొని గేదెకు గాయాలు
- వైద్యం చేయించి, సపర్యలు చేస్తూ కాపాడుతున్న హోటల్ యజమాని

నిడమనూరు : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ సూడి గేదెకు తీవ్ర గాయాలయ్యాయి. లేవలేని స్థితిలో తీవ్ర ఇబ్బందులు పడుతోంది. గేదె దీనస్థితిని చూసి ఓ హోటల్ యజమాని దానికి చికిత్స చేయించి సంరక్షిస్తున్నాడు. రోడ్డు వెంట వెళ్తున్న వారు గేదె పరిస్థితిని చూసి అయ్యో పాపం అంటున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిడమనూరు మండలం నార్లగూడ మేజర్ సమీపంలో ఇటీవల గుర్తుతెలియని వాహనం గేదెను ఢీకొట్టి వెళ్లిపోయింది. మరుసటి రోజు సమీపంలోని ఓ హోటల్ యజమాని నరేంద్ర గమనించాడు. గేదె పడుతున్న అవస్థ చూసి రోడ్డు పక్కన చెట్టునీడకు జరిపించాడు. బంకాపురం గోపాల మిత్ర నాగయ్యను రప్పించి వైద్య సేవలు అందిస్తున్నాడు. గడ్డి వేసి, నీళ్లు పెట్టి ఎండ తగలకుండా చర్యలు తీసుకుంటూ ఆ మూగజీవిని కాపాడుతున్నాడు. వారం రోజులవుతున్నా గేదె కోసం ఎవరూ రాలేదని, మూగజీవి అవస్థ చూడలేక సేవ చేస్తున్నట్లు నరేంద్ర తెలిపారు.



చెట్టుకింద సేదదీరుతున్న గేదె

శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలు



మిర్యాలగూడలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ప్రజలు



వేములపల్లిలో గ్రామపంచాయతీ భవనం ప్రారంభిస్తున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు



మట్టపల్లి ఆలయానికి వస్తున్న మంత్రులు



మిర్యాలగూడలో బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న మంత్రులు



మిర్యాలగూడలో పీడియాట్రిక్ వార్డు ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి ఎమ్మెల్యే



మహిళలతో సెల్ఫీ దిగుతున్న మంత్రి హరీశ్‌రావు

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



సత్తయ్య (ఫైల్)

రామన్నపేట : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీర్నేముల గ్రామానికి చెందిన ఓ కౌలు రైతు అప్పుల బాధ తాళలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నీర్నేముల గ్రామానికి చెందిన కదారి సత్తయ్య (65) రామన్నపేట శివారులో ఏడు ఎకరాల భూమి కౌలుకు తీసుకొని నాలుగేళ్లుగా సాగు చేస్తున్నాడు. రెండేళ్ల నుంచి కాలం కలిసి రాక దిగుబడులు తగ్గి కౌలు కోసం, పెట్టుబడి నిమిత్తం చేసిన అప్పులు తీరలేదు. కొద్దిరోజులుగా అప్పులు తీర్చేదెట్లా అని దిగులు చెందుతున్నాడు. ఈ క్రమంలోనే మనస్తాపం చెందిన సత్తయ్య ఈనెల 25న మధ్యాహ్నం కౌలు చేస్తున్న పొలం వద్దకు వెళ్లి మడికట్లలో ఉన్న చెత్తను తగులబెట్టి ఇంటికి వచ్చాడు. సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్‌రూంలో ఉరివేసుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి కుమారుడు నాగరాజు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపారు.